క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గొటేటి ఫంక్షన్ హాల్, సాయినగర్, శివాలయం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ ఆలిండియా రేడియో స్టేషన్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు. 11కేవీ ఆటోనగర్, హుడాసాయినగర్, మన్సూరాబాద్, సౌత్‌ఎండ్‌పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల సమస్యలు, ఫిర్యాదులు, సలహాలు స్వీకరించేందుకు శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్లు డీఎం కృష్ణమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ్, జుక్కల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సుల ప్రయాణికులు సమస్యలు, సూచనలు తెలియజేయాలనుకుంటే సెల్ నంబర్ 9959226249కు కాల్ చేయాలని సూచించారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ మున్సిపల్ చైర్మన్‌గా వినోద్



నియామకపత్రం అందజేస్తున్న కేఎల్లార్

పహాడీషరీఫ్: కాంగ్రెస్ ఎస్సీసెల్ మున్సిపల్ చైర్మన్‌గా యంజాల వినోద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ఎస్సీసెల్ నియోజకవర్గ చైర్మన్ క్యారగారి శ్రీధర్ జారీ చేసిన ఉత్తర్వుల పత్రాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దేప భాస్కర్ రెడ్డి, నియోజకవర్గం ఎస్సీసెల్ వైస్ చైర్మన్ వి.నారాయణ, సమన్వయకర్త స్వర్ణగంటి సుభాష్, జల్‌పల్లి సీనియర్ నాయకులు షేక్ జహంగీరుద్దీన్, చింతకింది నవీన్ గౌడ్, పందెం కొండల్ యాదవ్, మాధవ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న మహేశ్వరం ఏసీపీ జానకీ రెడ్డి

పహాడీషరీఫ్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణచివేస్తామని మహేశ్వరం ఏసీపీ ఎస్.జానకీ రెడ్డి హెచ్చరించారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శుక్రవారం ఆయన ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డితో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు.రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. సామాన్య ప్రజలపై బెదిరింపులకు పాల్పడడం, ఇతర నేరాలలో భాగస్వాములైనట్లయితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో పెట్రోలింగ్ కొనసాగిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని చెప్పారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించండి



ఏఎంసీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుల

మీర్‌పేట: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి బాబు డిమాండ్ చేశారు. ప్రమాదబీమా, వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. శ్రామికుల న్యాయమైన డిమాండ్ల సాధనకై శనివారం సీడీఎంఏ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కార్మికులు వెళ్లేందుకు సహకరించాలని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నాగేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, ఎం.నర్సింహ, బావమ్మ, కమలమ్మ, రవీందర్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పొంచిఉన్న ముప్పు..



బుర్హాన్ ఖాన్ చెరువు తూమును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త
- మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్
- బుర్హాన్ ఖాన్ చెరువు పరిశీలన

పహాడీషరీఫ్: ప్రస్తుత వర్షాలతో ప్రమాదం పొంచి ఉందని, ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. బుర్హాన్ ఖాన్ చెరువులోకి వరద వస్తే.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది తగిన చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌నగర్‌లోని బుర్హాన్ ఖాన్ చెరువు పరిసరాలను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువు ఎంత వరకు నిండింది, ముంపు ప్రభావం ఎలా ఉంది, రెండో తూము నుంచి దిగువకు నీరు ఏ స్థాయిలో వెళ్తుందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఎప్పటి నుంచో నిండు కుండలా ఉన్న ఈ చెరువుతో ఇప్పటికే కొన్ని నివాసాలు నీట మునిగి, బాధితులు ఇళ్లను ఖాళీ చేసి వదిలిపోయారు. తాజా వర్షాలతో ఎగువన ఇళ్లల్లోకి నీరు రానప్పటికీ, రెండో తూము నుంచి మిగులు నీరు వెంకటాపూర్ వీకర్ సెక్షన్ కాలనీ మీదుగా వేసిన పైప్‌లైన్‌లోకి సాఫీగా వెళ్లేలా మార్గాలను శుభ్రం చేయించారు. కమిషనర్ వెంట మాజీ కౌన్సిలర్ మజహర్ అలీ, పర్యావరణ అధికారి ఎం.శ్రీను తదితరులు ఉన్నారు.

ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలి

వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలని కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. పహాడీషరీఫ్ గ్రామంలో ఫ్రై డే–డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారానికి ఒక రోజు ఇంట్లో సంపు, పాత్రల్లో ఉన్న నీటిని పూర్తిగా పారబోసి, కొత్త నీటిని పట్టుకోవాలని సూచించారు. ఇలా చేయడం వలన నిల్వ నీటిలో లార్వా దశలో ఉన్న దోమలు వృద్ధి చెందవని తెలిపారు. వర్షాకాలంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఇళ్లల్లో ఉన్న పాత కొబ్బరి చిప్పలు, టైర్లను పడేయాలని సూచించారు. మున్సిపల్ తరఫున ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహించడంతో పాటు, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నామని చెప్పారు. చెత్తను ఎత్తిన వెంటనే బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నామని పేర్కొన్నారు.

తాగునీటి వసతి కల్పించండి



కేఎల్లార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: తుక్కుగూడ పురపాలిక పరిధి పలు గ్రామాల ప్రజలకు తాగునీటి వసతి కలిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన కేఎల్లార్.. సంబంధిత అధికారులకు ఫోన్ చేశారు. ప్రజలకు అవసరమైన తాగునీటి వసతి కల్పించాలని, అవసరమైన ప్రదేశంలో పార్కులను నిర్మించాలని సూచించారు.

పేదలకు వరంగా సీఎంఆర్‌ఎఫ్

పహాడీషరీఫ్: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డితో కలిసి జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన చెన్నం పాండుకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మస్న రవికుమార్, పరమేశ్, శాంతమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి..

కందుకూరు: నేదునూరు పంచాయతీ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ పలువురు గ్రామస్తులు.. మాజీ వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో.. కేఎల్‌ఆర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామాన్ని ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయాలని, హనుమాన్ ఆలయం నుంచి మురళీనగర్ వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డును బీటీగా మార్చాలని, కేకే బస్తీ నుంచి మక్తమాధారం వరకు బీటీ రహదారి నిర్మించాలని, నేదునూరు అనుబంధ గ్రామం మాన్యగూడ, ముక్కిడివాగుతండాలను కలిపి నూతన గ్రామ పంచాయతీగా మార్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనికి స్పందించిన కేఎల్లార్.. త్వరలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసి వారి దృష్టికి తీసుకెళ్లి వివరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, గ్రామశాఖ అధ్యక్షుడు సురేష్, సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలయ్య, బాబు, నాగరాజు, రాములు, నాయకులు నర్సింహ, శంకర్, శ్రీశైలం, రవి, మాన్యగూడ యూత్ అధ్యక్షుడు శివశంకర్, రమేశ్, కృష్ణ, పోశయ్య, మహేష్, పాండు, వెంకటయ్య, శంకర్, శ్రీరాములు, లక్ష్మయ్య, బాలకృష్ణ, వంశీ, రాజు, కె.జంగిలి, రంగస్ భిక్షపతి, అడివయ్య, చెన్నయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల పారాహుషార్



ఆస్పత్రి ఆవరణలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

శంషాబాద్: సీజనల్ వ్యాధుల నియంత్రించేందుకు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు వివరాలు, వాటి సరఫరాను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ దుర్గలతకు సూచించారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఆస్పత్రి పరిసరాల్లో వర్షపు నీరు నిలవకుండా వారానికోసారి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా హాజరు పట్టికను పరిశీలించి, రోగులను వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ సేవలకు నీటి కొరత ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలత ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావును కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పరిశుభ్రతతో వ్యాధు లు ప్రబలే అవకాశం ఉండదన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

పేద విద్యార్థులకు అండగా ఉండాలి



విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేసినవిజయ్‌కుమార్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఐటీ సంస్థలు, సేవా సంస్థలు, దాతలు అండగా ఉండాలని మండల విద్యాధికారి జి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఓపెన్ టెక్స్ ఐటీ సంస్థ అందించిన స్కూల్ బ్యాగ్‌లు, స్టేషనరీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి అన్ని రకాల సౌకర్యాలను పేద విద్యార్థులకు అందించటం సాధ్యం కాదన్నారు. కొన్ని ఇలాంటి సేవా దృక్పథం ఉన్న సంస్థలు అందిస్తే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ డి.పురుషోత్తం, ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలను అందిస్తాం

ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీసుధా

మహేశ్వరం: మెరుగైన సేవలు అందించి, ప్రయాణికులను వారివారి గమ్యస్థానాలకు చేరుస్తామని మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీసుధా అన్నారు. ఐఎస్ సదన్ వయా బీఎస్‌రెడ్డి వరకు కొత్తగా ఆర్టీసీ బస్సును తిప్పనున్నామని తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని డిపోలో నూతన సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. మహేశ్వరం నుంచి బొంగుళూరు గేటు, తుర్కయంజాల్, బీఎస్‌రెడ్డి వైపు వెళ్లే వారికి కొత్తగా సర్వీసును వేశామని పేర్కొన్నారు. మహేశ్వరం నుంచి మూడు, తుక్కుగూడ నుంచి మూడు ట్రిప్పులు తిప్పనున్నామని చెప్పారు. మహేశ్వరం, తుక్కుగూడ, రావిర్యాల, ఆదిబట్ల గేటు, బొంగుళూరు గేటు, మన్నెగూడ, తుర్కయంజాల్, బీఎస్‌రెడ్డి, సాగర్ రింగ్ రోడ్డు, కర్మాన్‌ఘాట్, చంపాపేట్, ఐఎస్ సదన్ వరకు తిరుగుతుందని వివరించారు. ప్రయాణికులు కొత్త సర్వీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కమలనాథుడికి సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న వెంకటేశ్

మహేశ్వరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును బీజేవైఎం చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్, నాగారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేష్.. నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని రాంచందర్ సూచించారని వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, మండల అధ్యక్షుడు టి.యాదిష్, నాయకుడు జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు గుళ్ల బోనాలకు రండి

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, రామకృష్ణాపురం డివిజన్‌లోని పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల గుడి (మూడు గుళ్లు) బోనాల ఉత్సవాలు ఈనెల 31 నుంచి ఆగస్టు 3 నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచన్నగారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డికి శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 31న 1వ తేదీన రేణుకా ఎల్లమ్మ కల్యాణం, 3న అమ్మవార్లకు బోనాలు సమర్పణ సాయంత్రం మైసమ్మ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత, ప్రధాన కార్యదర్శి బండి మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడు గట్ల రవీంద్ర పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

లింగోజిగూడ: శివపురికాలనీలో రూ. 60 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లోని అంతర్గత రోడ్లను దాదాపు రూ. 62 లక్షల పూర్తిచేశామని, మిగిలిన ప్రధాన రోడ్డును వేయాలని కాలనీవాసులు కోరారని వీటి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈలు విజయ్‌కుమార్, పవిత్ర నవీద్‌అలీ, కాలనీవాసులు కృష్ణారెడ్డి, నర్సింహాగుప్తా, బుజ్జి, రాజేశ్‌గౌడ్, నాయకులు శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

వైభవంగా కుంకుమార్చన

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయం వద్ద శ్రావణ శుక్రవార పూజలు, హోమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీమాత చండీ ఉపాసకులు రేవెళ్ల రాజుశర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన, ఐశ్వర్యలక్ష్మీ, అష్టలక్ష్మీ యాగాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

నాగోలు: పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) సీఐ దేవేందర్ హెచ్చరించారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు ఆదేశాల మేరకు రాచకొండ ఎస్‌ఓటీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ ఎండీ. షాకీర్ హుస్సేన్ సూచనల మేరకు 'ఆపరేషన్ ముస్కాన్'లో భాగంగా రాచకొండ ఏహెచ్‌టీయూ సిబ్బంది ఎన్టీఆర్‌నగర్, ఎల్‌బీనగర్‌లో వ్యాపారులకు శుక్రవారం అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారిచే పని చేయించడం వల్ల వారి ఆరోగ్యం, విద్య, భద్రత వారి అభివృద్ధికి హాని అవుతుందని, ఇది వారి హక్కులను ఉల్లంఘించడమే కాకుండా వారి భవిష్యత్తును కూడా నాశనం చేస్తుందని తెలిపారు. బాలల హక్కులను కాపాడడం వారి భవిష్యత్తును నిర్మించడం మనందరి బాధ్యత తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటశ్రీను, రాములు, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటంలో ముందుంటాం



బడంగ్‌పేట్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు


- పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు
- బడంగ్‌పేట్, బాలాపూర్‌లో సంఘం సభ్యత్వ నమోదు

బడంగ్‌పేట్: ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం, పరిష్కారంలో తమ సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు అన్నారు. బడంగ్‌పేట్, బాలాపూర్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్‌ఎం రామానుజారెడ్డి, ఎఫ్‌ఏసీ హెచ్‌ఎం జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులకు మెంబర్‌షిప్‌లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, డిమాండ్ల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ బాలాపూర్ మండల అధ్యక్షుడు కె.రాంభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర బాధ్యులు ప్రతాప్‌రెడ్డి, చైతన్యకుమార్, కృష్ణజీ, ధనుంజయ్, వెంకటరమణారెడ్డి, మండల బాధ్యులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చేపట్టిన నిర్మాణం సీజ్

రాజేంద్రనగర్: ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ పనులు చేపడుతున్న నిర్మాణాన్ని రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి సర్వే నంబర్ 13లోని రెండు ప్లాట్లు కొనుగోలు చేసిన యజమాని కొన్ని రోజులుగా భారీగా సెల్లార్ పనులను చేపడుతున్నారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులకు సమాధానం ఇవ్వకుండా పనులను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సెల్లార్ పనులను నిలిపివేయాలని చివరిసారిగా హెచ్చరించినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ స్థలాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి విశాల్ రెడ్డి మాట్లాడుతూ... సెల్లార్ పనులకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. పనులను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు అందించినా స్పందించలేదన్నారు. దీంతో నిర్మాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ రెవెన్యూ చట్టం ప్రకారం స్థలాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టేవారు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ నుండి అనుమతులు పొందాలని సూచించారు. పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా అనుమతులను జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించి ఎప్పటికప్పుడు నోటీసులను జారీ చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, వందరోజుల ప్రణాళికలో బైరాగిగూడలో పార్కు అభివృద్ధి చేయాలని స్థానిక నాయకులు కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం రోడ్డు గుండా వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయన్నారు. గుంతలు, వాహనాల రద్దీ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కమిషనర్‌కు వివరించారు. వర్షాకాలంలో మరీ ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. రాత్రివేళలో గుంతలు తెలవడం లేదన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కమిషనర్‌ను కోరారు. స్పందించిన కమిషనర్ త్వరలో రోడ్డు మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. స్థానిక నేతలు హరీష్‌గౌడ్, రాంప్రసాద్, చిట్టిబాబు, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేద్దాం

మణికొండ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు

మణికొండ: పెరుగుతున్న జనాభా, నిర్మాణాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న మున్సిపాలిటీల్లో సాధ్యమైనంత ఎక్కువ స్థాయిలో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించేకు ప్రతి ఒక్కరూ వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మణికొండ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 16 పార్కులలో పెద్ద ఎత్తున చేపట్టే వనమహోత్సవాన్ని ఆయన అలకాపూర్ టౌన్‌షిప్‌లోని అబ్దుల్ కలాం పార్క్‌లో మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పచ్చదనం ఎంత పెరిగితే ప్రజల ఆరోగ్యాలు అంత బాగుంటాయన్నారు. పార్కులతో పాటు రోడ్ల పక్కన, ప్రభుత్వ స్థలాల్లో వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటించాలన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో పండగలకు మామిడి ఆకులు లభించటం ఇబ్బందిగా మారిందని, భవిష్యత్తులో ప్రజలందరికీ మామిడి ఆకులను అందించే క్రమంలో ప్రతి పార్కులో మూడు మామిడి మొక్కలను నాటించటం మంచి పరిణామన్నారు. డీఈలు శివసాయి, సంజయ్, గౌతం మోడల్ స్కూల్ విద్యార్థులు, అలకాపూర్ టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

బడ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి చెత్తను సేకరించే కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ మల్లికార్జున కాలనీలో తడి, పొడి, హానికరమైన చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.